క్లుప్తంగా

నువ్వు చల్లగుండాలమ్మా..!



వంగా గీతను దీవిస్తున్న వృద్ధుడు

పిఠాపురం: మండుటెండలో పిఠాపురంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో ఆందోళన చేస్తున్న వంగా గీతకు ఓ వైఎస్సార్ సీపీ అభిమాని పుచ్చకాయ ముక్క తెచ్చి ఇస్తూ నువ్వు చల్లగుండాలమ్మా అంటూ దీవించారు. ఆ పెద్దాయన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

పెద్దాపురం: చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో పెద్దాపురంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం ఇంద్రజాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. డాక్టర్ బోస్ మ్యాజిక్ స్టార్ అవార్డు గ్రహీత, పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించారు. సైన్స్ మేళవింపుగా ఇంద్రజాలం ప్రదర్శన ఆకట్టుకుంది. భారతీయ సంస్కృతిలో ఇంద్రజాలం ఒక పురాతన కళ అన్నారు. అనంతరం పలు అంశాలపై మ్యాజిక్ షో నిర్వహించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులో బ్రౌన్‌పేట నుంచి కోదండరామపురం వరకు రోడ్డు మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ అధికారులు రుసుం చెల్లించడంతో వారి సూచన మేరకు విద్యుత్తు స్తంభాలను మార్పు చేస్తామన్నారు. ఉప్పువారి సత్రంకు వచ్చే 11కేవీ ఫీడర్, టిడ్కో సముదాయానికి వచ్చే బీఆర్ అంబేడ్కర్ ఫీడర్, పిఠాపురం రోడ్డులోని అగ్రికల్చర్ ఫీడర్, డీఎడ్కే ఫీడర్లపై విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బ్రౌన్‌పేట నుంచి టిడ్కో సముదాయం, వ్యవసాయ క్షేత్రం, భీమేశ్వరాలయ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి గ్రామోత్సవం



మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సామర్లకోట: స్థానిక గోదావరి నదీ తీరంలో ఉన్న పురాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో వెలసిన మహాలక్ష్మీ అమ్మవారి గ్రామోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి సామూహికంగా పంచామృతాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక గజ వాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు..

7 నుంచి పాదాంబికా అమ్మవారి వార్షికోత్సవాలు

పిఠాపురం: గొల్లప్రోలులో వేంచేసియున్న పాదాంబిక అమ్మవారి తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈనెల 7న శనివారం ఉదయం 8 గంటలకు అమ్మవారికి సప్త నదీ జలాలతో 108 మంది ముత్తైదువులు, యువతులు, భక్తుల సమక్షంలో సహస్ర జ్యేష్టాభిషేకం నిర్వహించనున్నారు. 8, 9వ తేదీల్లో ప్రత్యేక పూజలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

జనసేనలో వర్గ విభేదాలు

పిఠాపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహించాలని సాక్షాత్తు రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, జనసేన నాయకులు ఇచ్చిన పిలుపును పిఠాపురం నియోజకవర్గంలోని ప్రజలు పట్టించుకోలేదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలో బుధవారం ఏడాది ఉత్సవాలలో జనసేన నేతల మధ్య వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. రెండు వర్గాలుగా విడిపోయిన జనసేన నేతలు ప్రజల సహకారం లేక పోవడంతో ఎవరికి వారే ఎమునా తీరే అన్నట్టుగా ఉత్సవాలు తూతూమంత్రంగా నిర్వహించడం చర్చనీయాంశమైంది. జనసేన నేతలు పిఠాపురం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు, పార్టీ శ్రేణులు హాజరుకాలేదు. చివరికి ముగ్గుల పోటీలు పెట్టి విలువైన బహుమతులు ప్రకటించినా మహిళలు అంతగా రాకపోవడంతో వీర మహిళలతో ఆ కార్యక్రమం తూతూమంత్రంగా ముగించారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరిస్తున్నారన డానికి ఇది నిదర్శనంగా నిలిచింది. వైఎస్సార్ సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతా విశ్వనాథ్ ఆధ్వర్యంలో పిఠాపురంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి జనం పోటెత్తారు.



పిఠాపురంలో తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



పిఠాపురంలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



పిఠాపురంలో ఆందోళన నిర్వహిస్తున్న మహిళలు



పెద్దాపురంలో పోలీసుల ఆంక్షల కారణంగా పాదయాత్రగా వెళుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



సామర్లకోట నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణుల మోటారు సైకిల్ ర్యాలీ

వెన్నుపోటుపై తిరుగుబాటు

- పథకాలు అమలు చేయని కూటమి ప్రభుత్వ తీరుపై నిరసన గళం
- పిఠాపురం, పెద్దాపురంలో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు
- వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం విజయవంతం
- పెద్దాపురంలో మోటారు సైకిల్ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు



పిఠాపురంలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వంగా గీత



పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు

పిఠాపురం: నమ్మి ఓట్లు వేస్తే అధికారంలోకి వచ్చాక నట్టేట ముంచారంటూ కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ చంద్రబాబు వెన్నుపోటుపై తిరుగుబాట బావుటా ఎగురవేసారు. వైఎస్సార్ సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు పిఠాపురంలో కదం తొక్కారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతావిశ్వనాథ్ ఆధ్వర్యంలో కూటమి మోసాలపై మొదటి తిరుగుబాటు విజయవంతమైంది. భారీగా తరలివచ్చిన జనం భారీ ప్రదర్శన నిర్వహించి తమ గళాన్ని ప్రభుత్వానికి వినిపించేలా ఆందోళన నిర్వహించారు. పిఠాపురం ఉప్పాడ సెంటర్లో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి జనం భారీగా తరలివచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో పిఠాపురం మార్మోగింది.

అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం : వంగా గీతావిశ్వనాథ్

పిఠాపురం, ఉప్పాడ సెంటర్లో నిర్వహించిన సమావేశంలో వంగా గీత మాట్లాడుతూ ప్రభుత్వ మోసాలను కూటమి నేతల వెన్నుపోటును ఎండగట్టారు. కూటమి ప్రభుత్వం ఆనందంలో ఉంటే ప్రజలు ఆందోళనలో ఉన్నారన్నారు. రైతు కుటుంబాలకు ఎటువంటి పథకాలు అందలేదన్నారు. ఫ్యామిలీ వైద్యం , ప్రభుత్వ ఆసుపత్రులు, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విద్యా పథకాలు, ప్రభుత్వ పాఠశాలలు ఇలా అన్ని వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. రేషన్ వాహనాలు వాహనాలు పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేసారు. నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని అన్నారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వక పోగా ఉన్న ఉద్యోగాలు తీసేస్తున్నారని విమర్శించారు. తక్షణం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయాలి లేకుంటే ప్రజలు ప్రారంభించిన ఉద్యమం మరింత తీవ్రతరం అవుతుందన్నారు. ఉప్పాడ సెంటర్లో ప్రారంభించిన నిరసన ర్యాలీ పాత బస్టాండ్, అంబేడ్కర్ సెంటర్లో అంబేడ్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా వెళ్లి తహసీల్దారుకు వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ఉలవల భూషణం, కాకినాడ జిల్లా అధికార ప్రతినిధి పెదపాటి రాజేష్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కారే శ్రీనివాసరావు, కొప్పన శివనాథ్, జెడ్పీటీసీలు వులవకాయల నాగ లోవరాజు, గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీ శెట్టిబత్తిన సురేష్‌కుమార్, పిఠాపురం పట్టణ, మండల, గొల్లప్రోలు నగర పంచాయతీ, మండల, కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రావుల మాధవరావు, అడపా రఘు, మైనం రాజా, అరిగెల రామయ్యదొర, ఆనాల సుదర్శన్, గంగ్రేటి రామచంద్రమూర్తి, జ్యోతుల భీముడు, మొగలి అయ్యారావు, ఆకుల శ్రీను, గొల్లపల్లి నానాజీ, తెడ్లపు చిన్న, అంజూరి రాంబాబు, దాసం వెంకటేష్, జ్యోతుల బాబులు, పచ్చిమళ్ల అప్పలరాజు, గుల్లపల్లి గణేష్, వర్ధినీడి శ్రీనివాస్, కొత్తెం పశువుల రావు, గ్రంధి గణేష్, మేరుగు ఎల్లాజీ, బొందు రాంబాబు, గోగు జగన్నాథం, గోగు బుజ్జి, పాలెపు దొబాబు, చిన్న, వజ్రపు వీరేష్, బోను దేవ, బత్తిన రాజశేఖర్, చెల్లూరి లోవరాజు, ముమ్మిడి శ్రీనివాస్, బోనాసుల శివ, పెదపాటి రమేష్, రామకుర్తి నాగబాబు పాల్గొన్నారు.

మహిళల నిరసన

పిఠాపురం: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతావిశ్వనాథ్ ఆధ్వర్యంలో కూటమి మోసాలపై పిఠాపురంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో పలువురు మహిళలు తీవ్ర ఆందోళన నిర్వహించారు. ముఖ్యంగా తమకు కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వారు నిరసన వ్యక్తం చేసారు. పిఠాపురం ఉప్పాడ సెంటర్లో నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి హాజరైన మహిళలు నడిరోడ్డుపై నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. మహిళలకు అందాల్సిన పథకాలను నిలిపివేసి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, కాజులూరి ప్రియ, అల్లవరపు మల్లిక, సోమరౌతు లలిత, వడ్డి నాగమణి, ఆలపు సుధారాణి, లంకా వెంకటలక్ష్మి, చింతాడ నీలవేణి, రాసంశెట్టి భవానీ, వజ్రపు శైలజ, కుంచే నాగమణి పాల్గొన్నారు.

కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

సామర్లకోట: కూటమి నాయకులు ప్రజలకు చేసిన ద్రోహానికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కదం తొక్కారు. స్థానిక పార్టీ కార్యాలయానికి నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యాకర్తలు ఉదయం 9 గంటలకే చేరుకున్నారు. అక్కడి నుంచి మోటారు సైకిల్ ర్యాలీగా పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయానికి బయలుదేరారు.

పాదయాత్రగా ఆర్డీఓ కార్యాలయానికి తరలిన నాయకులు

మోటారు సైకిల్ ర్యాలీకి అనుమతి లేదని ర్యాలీని సీఐ కృష్ణభగవాన్, పెద్దాపురం ఎస్సై మౌనిక అడ్డుకున్నారు. దీంతో ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి మండే ఎండలో పార్టీ నాయకులు కార్యకర్తలు సీనియర్ పార్టీ నాయకుడు దవులూరి సుబ్బారావు ఆధ్వర్యంలో పాదయాత్రగా మూడు కిలోమీటర్లు తరలివచ్చారు. పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు.

పెద్దాపురం ఆర్డీఓకు వినతిపత్రం

పోలీసుల అనుమతితో కేవలం 10 మందిని మాత్రమే ఆర్డీఓ కార్యాలయంలోకి అనుమతించారు. దాంతో రాష్ట్ర మాజీ కార్మిక సంఘ నాయకుడు దవులూరి సుబ్బారావు నాయకత్వంలో ఆర్డీఓకె శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తూ జిల్లా కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్‌లకు వినతి పత్రాలు అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆర్డీఓను కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తిబాబు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, ఉబా జాన్ మోజెస్, రాష్ట్ర నాయకులు కంటే వీర్రాఘవరావు పాల్గొన్నారు.

వెన్నుపోటు పొడవటం చంద్రబాబుకు కొత్త కాదు

ఈ సందర్భంగా సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ వెన్నుపోటు పొడవటం చంద్రబాబునాయుడికి కొత్త కాదని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందజేశారని గుర్తు చేశారు. అంతకు మించి పథకాలు అందజేస్తానని హామీ ఇచ్చి అధికారం చేపట్టాక చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి కరణం భాను, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, పట్టణ పార్టీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, పట్టణ మహిళా అధ్యక్షురాలు పాలిక కుసుమ, పెద్దాపురం పార్టీ అధ్యక్షుడు కాపుగంటి కామేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు దమ్మాల లక్ష్మణరావు, బ్రహ్మణనాయుడు యువజన సంఘ జిల్లా అధ్యక్షుడు ఆదపురెడ్డి శ్రీనివాసు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు మోరంపూడి రమేష్, మహ్మద్ జానీ, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దాపురం ఫేస్‌బుక్ టీం సేవలు అభినందనీయం



మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం ప్రోత్సాహంతో భోజనం వడ్డిస్తున్న ఆర్‌సీబీ యూత్ సభ్యులు

పెద్దాపురం: మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం సేవలు అభినందనీమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం ప్రతి బుధవారం గర్భిణులకు ఆహారం పంపిణీ (మాతృత్వం) కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 61వ వారం ఆహారం పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆర్‌సీబీ యూత్ సహకారంతో బుధవారం గర్భిణులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఐపీఎల్‌లో ఆర్‌సీబీ విజయోత్సవం నేపథ్యంలో ఆర్‌సీబీ, కోహ్లీ అభిమానులు గర్భిణులకు ఆహారాన్ని అందించి మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం సేవలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రతి బుధవారం 60 వారాలుగా వారికి అవసరమైన ఆహారం అందిస్తున్నట్టు టీం సభ్యులు తెలిపారు. ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్ పెదిరెడ్డి మాట్లాడుతూ 61వ వారం మాతృత్వం కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు. దాతలు సహకారం, టీమ్ సభ్యుల ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం ముందుకు నడిపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫేస్‌బుక్ టీం సభ్యులు లక్ష్మణ్ దివాకర్, నవీన్ నాని, రాజేష్‌కుమార్, రాఘవ, జయశ్రీ, లక్ష్మి, రత్నం పాల్గొన్నారు.


తాగునీరు, పారిశుధ్య సమస్య పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: పట్టణంలో ఉన్న మంచినీటి సమస్య, పారిశుధ్య సమస్యను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం పెద్దాపురం మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. బుధవారం సీపీఎం కమిటీ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ 60 వేల పైబడి జనబా కల్గిన పట్టణంలో విస్తరణ పెరిగిందని, ఊరి చివరి ప్రాంతాల సంఖ్య మురుకివాడల సంఖ్య పెరుగుతూనే ఉందన్నారు. పట్టణంలో గోదావరి నీరు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. పట్టణంలో మంచినీటి సమస్య, పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ మంచినీటి కోసం రూ.37 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. త్వరలో మంచినీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, సీపీఎం నాయకులు సిరపురపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ., రొంగల వీర్రాజు, యాసలపు రమేష్, కూనిరెడ్డి అప్పన్న పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె



సామర్లకోటలో సమ్మె కొనసాగిస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులు

సామర్లకోట: మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 29వ రోజు కొనసాగింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 7వ తేదీ నుంచి కార్మికులు సమ్మె చేస్తున్న విషయం విదితమే. మున్సిపల్ అధికారులు, పాలకుల నుంచి ఎటువంటి స్పందన లేక పోవడం, మున్సిపల్ మంత్రితో చర్చలు విఫలం కావడంతో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సమ్మె కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్సు యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు మాట్లాడుతూ ఏడు నెల క్రితం సీడీఎంఏ చర్చ పేరుతో తమ సమస్యలు పరిష్కరించడానికి మూడు నెలల సమయం కోరారని, ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సీనియారిటీ ప్రాతిపదికలో వేతనాలు చెల్లించాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలనే డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కుళాయిల్లో కలుషిత నీరు



గొల్లప్రోలు నగర పంచాయతీ 10వ వార్డులో కుళాయిల ద్వారా వచ్చిన కలుషిత నీరు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో పబ్లిక్ కుళాయిల్లో కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి పథకం నిర్వహణలో అధికారులు అలసత్వం వహించడం వల్లే కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వేణుగోపాలస్వామి ఆలయ భూమి కౌలు వేలం



వేణుగోపాలస్వామి భూముల సాగుకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపల్లి: స్థానికంగా వేంచేసియున్న వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించి బుధవారం భూములు మూడేళ్లకు కౌలు వేలం నిర్వహించగా ఆదాయం రెట్టింపు పెరిగింది. ఆలయ ఈవో ధనలక్ష్మి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 14.36 సెంట్లు సాగు భూమికి వేలం నిర్వహించగా గతేడాది 2.24లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.7.33 లక్షల ఆదాయం సమకూరింది. కొత్తపల్లిలోని సర్వే నంబర్‌లో 202,102/3లో గల 7.22 సెంట్ల భూమికి వేలం నిర్వహించగా ఈ ఏడాది 3.60 లక్షలు, వాకతిప్పలో సర్వే నంబర్ 428/2, 420/9లో గల 3.34 సెంట్లకు రూ.1.90 లక్షల ఆదాయం వచ్చింది. కొత్తపల్లిలో సర్వే నంబర్ 9లోని 1.54 సెంట్లకు రూ.52వేలు, ఎండపల్లిలో 238లోని 1.34 సెంట్లకు రూ. 80వేలు, కొత్తపల్లిలో సర్వే నంబర్ 26లోని 0.92 సెంట్లకు రూ.51 వేలు ఆదాయం సమకూరింది. ఈ వేలం పాటలో 42 మంది రైతులు పాల్గొన్నారు. కౌలుదారుల నుంచి ఒక సంవత్సరం శిస్తు సొమ్మును వసూలు చేసి వారికి భూములకు సంబంధించిన కౌలు హక్కును అప్పగించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారులుగా ఈఓ ధనలక్ష్మి, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో సరుగుడు తోట కౌలు వేలం

మండలంలోని మూలపేటలో వేంచేసియున్న జగన్నాథస్వామి ఆలయానికి సంబంధించిన 10.28 ఎకరాల సరుగుడు తోట భూమిని ఆలయ ఈఓ ధనలక్ష్మీ ఆధ్వర్యంలో వేలంపాటను నిర్వహించారు. 2018లో సరుగుడు తోట పెంచుకునేందుకు 6 ఏళ్లకు వేలం నిర్వహించారు. పెరిగిన సరుగుడు తోటకు బుధవారం వేలం నిర్వహించగా రూ.11 లక్షల ఆదాయం వచ్చింది. దీంట్లో సరుగుడు తోట పెంచిన రైతుకు రూ.5.50 లక్షలు, దేవదాయ శాఖకు రూ.5.50 లక్షలుగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై గోతుల పూడ్చివేత

సాక్షి ఇంపాక్ట్



సామర్లకోట గడియారం స్తంభం వద్ద గోతులు పూడ్చుతున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక గడియారం స్తంభం నుంచి బ్రౌన్‌పేట వరకు ఉన్న పిఠాపురం రోడ్డులో గోతులను పూడ్చే పనులకు బుధవారం ప్రారంభించారు. గత నెల 30న »అడుగడునా అవస్థలే« శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. స్థానిక గడియారం స్తంభం వద్ద గోతుల కారణంగా ఒక లోడు లారీ యాక్సిల్ విరిగి రోడ్డుపై నిలిచిపోయింది. దాంతో గడియారం స్తంభం నుంచి పిఠాపురం రోడ్డులో ఉన్న గోతుల వలన వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గడియారం స్తంభం, సాయిబాబా ఆలయం, గాంధీచౌక్, రైతు భవనం, బళ్లమారెట్ సెంటర్, మున్సిపల్ కార్యాలయం, బేతాళ స్వామి ఆలయం వద్ద ఉన్న గోతులను పూడ్చే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే ఈ గోతులు పూడ్చివేత పనులు మొక్కుబడిగా చేపట్టారనే ఆరోపణలున్నాయి. గడియారం స్తంభం వద్ద గోతులు పూడ్చివేత సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మాధవపట్నంలో ట్రాఫిక్ జామ్



సామర్లకోట-కాకినాడ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డు మాధవపట్నంలో బుధవారం మధ్యాహ్నం మండే ఎండలో వాహనాలు బారులు తీసి నిలిచిపోవడంతో వాహన చోదకులు విలవిల్లాడారు. ఈ రోడ్డులో మాధవపట్నం నుంచి సర్పవరం వెళ్లడానికి రైల్వే గేటు దాటవలసి ఉంటుంది. ఈ గేటు వేసిన సమయంలో రోడ్డుపై వాహనాలు బారులు తీసి నిలిచిపోయాయి. గేటు తీసిన తరువాత ఇరుకు కల్వర్టు మీదుగా సామర్లకోట వైపు నుంచి, కాకినాడ వైపు నుంచి వాహనాలు రైల్వే గేటుకు రాకపోకలు జరగడంతో ట్రాఫిక్‌లో వాహనాలు చిక్కుకున్నాయి. రైల్వే గేటు తీసిన సమయంలో ప్రతి రోజు ఇదే సమస్య ఏర్పడుతుందని ఆప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం, రోడ్డు మార్జిన్‌లో ఉన్న చెట్లు నరికి వేయడంతో ద్విచక్ర వాహన చోదకులు ఎండ వేడిమిని తట్టుకోలేకపోయారు. రైల్వే గేటు వేసిన సమయంలో ఒక కానిస్టేబుల్ ఉండే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు. మాధవపట్నంలో రెండు సచివాలయాలు ఉండటం వలన అక్కడే ఉండే మహిళా పోలీసులు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.